ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

• అదనపు కలెక్టర్ బీఎస్ లత



కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

మల్యాల: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అధికారులను అదనపు కలెక్టర్ బీఎస్ లత ఆదేశించారు. కొడిమ్యాల మండలంలోని పూడూరు, రామకృష్ణాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు పడకుండా, తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తూకం వేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, ఆర్ఐ కరుణాకర్, పాక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్: కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఖయ్యూం అన్నారు. మండలంలోని అయోధ్య, అల్లీపూర్ గ్రామాల్లో సోమవారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. భూపతిపూర్ సహకార సంఘం పరిధిలో ఒడ్డెలింగాపూర్, ధర్మాజీపేట, బోర్నపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సింగిల్ విండో చైర్మన్ ఏనుగు ముత్యంరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమాల్లో సింగిల్ విండో చైర్మన్ రాజలింగం, సీఈవో ఉపేందర్, ఏఈవో సుమలత, వైస్ చైర్మన్ మల్లయ్య, డైరెక్టర్ రమణ, కోసరి మహేశ్, సీఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, గంభీర్‌పూర్, అంబారిపేట, తాండ్య్రాల, కథలాపూర్, దూలూర్, బొమ్మెన, తక్కళ్లపెల్లి, పోతారం, చింతకుంట, పెగ్గెర్ల గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మండలాధికారులు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో శంకర్, ఎంపీవో రాజశేఖర్, ఏపీఎం నరహరి, సీసీలు అంజయ్య, విజయ నిర్మల, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం పోయడానికి స్థలం కేటాయించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

సారంగాపూర్: ధాన్యం పోయడానికి స్థలం కేటాయించాలని మండలంలోని ధర్మనాయక్ తండా రైతులు సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తాము పండించిన ధాన్యం సారంగాపూర్ సొసైటీ ఆధ్వర్యంలో సేకరిస్తున్నారని, కానీ ధాన్యం పోయడానికి స్థలం లేక రోడ్ల వెంట పోయాల్సి వస్తుందని వివరించారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బంది అవుతోందని, స్థలం కేటాయించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే జిల్లా అటవీశాఖాధికారితో ఫోన్‌లో మాట్లాడి స్థలం కేటాయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో బంజార రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మల్యాల: కొడిమ్యాల గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని బీజేపీ మండల నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. కొడిమ్యాల నుంచి గోవిందారం, తాండ్య్రాల హైవేను కలిపే డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాంపెల్లి రాజేశం, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, కైలసాని సత్యనారాయణ, అంకం జనార్దన్, మంచాల భూమేశ్,తదితరులు పాల్గొన్నారు.





రాయికల్, మల్లాపూర్‌లో అరెస్టయిన మాజీ సర్పంచులు

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్

కోరుట్లరూరల్/ రాయికల్/ఇబ్రహీంపట్నం /మల్లాపూర్/పెగడపల్లి/మేడిపల్లి: తమ పదవీ కాలంలో చేపట్టిన పనుల పెండింగ్ బిల్లుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచులు చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి జిల్లా కు చెందిన పలువురు తాజా మాజీ సర్పంచులను పోలీసులు సోమవారం ఉదయం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని, వెంటనే బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు



ఎస్పీకి పూలమొక్క ఇస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా పోక్సో కోర్టులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన చీటి రామకృష్ణారావు సోమవారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

నర్సరీల్లో మొక్కల పెంపకంపై శిక్షణ



నందగిరిలో శిక్షణ ఇస్తున్న అధికారులు

పెగడపల్లి: నర్సరీల్లో కనీసం 10 ప్రైమరీ బెడ్స్ ఉండేలా చూసుకోవాలని ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ సౌమ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పెగడపల్లి మండలం నందగిరి వన నర్సరీలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, వన సేవకులకు సోమవారం మొక్కల పెంపకంపై అటవీశాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే విధంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలి తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, ఏపీవో అనిల్, ఈసీ రమాపతి పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టడం హర్షణీయం

మల్లాపూర్: ప్రభుత్వం బీసీ కులగణనను చేపట్టడం హర్షణీయమని కాంగ్రెస్ బీసీసెల్ మండల అధ్యక్షుడు వర్ద సురేశ్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయంలోమాజీ ఎంపీపీ నల్ల రాజన్నతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేపడుతామని ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా బీసీ నాయకులు మహేష్‌కుమార్‌గౌడ్‌కి అవకాశం కల్పించిన పార్టీ కాంగ్రెస్సేనని తెలిపారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం బీసీలకు న్యాయం చేసేందుకే కులగణన చేపట్టిందని పేర్కొన్నారు. సమావేశంలో బీసీ సంఘం జిల్లా నాయకులు సిరిపురం రవీందర్, కొండ్ల రాజం, కోటగిరి ఆనంద్‌గౌడ్, నైనేని రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు మరమ్మతు చేపట్టాలి

మల్యాల: మండలంలోని మ్యాడంపల్లి ప్రధాన రహదారి వెంట ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరి కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని, మరమ్మతు చేపట్టాలని మ్యాడంపల్లికి చెందిన ముదిరాజ్ యూత్ నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఎస్సారెస్పీ డీ–65 కాలువ ద్వారా నీరు సుద్దపల్లి, రాఘవపట్నం గ్రామాలకు ఇదే పైపుల గుండా వెళ్తున్న క్రమంలో రోడ్డు కిరువైపులా భారీ గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. తక్షణమే కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ముదిరాజ్ యూత్ అధ్యక్షుడు బాసవేని విష్ణు, చికట్ల రవీందర్, పి.రవీందర్, టి.అమరేందర్ వినతి పత్రంలో కోరారు.

ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం సరికాదు

కోరుట్ల రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ ఇంత వరకూ కొనుగోళ్లు మొదలు కాలేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోమాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం తగదన్నారు. పది నెలల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు గోసలు తప్ప ఏలాంటి లాభం చేకూరలేదన్నారు. మోసపూరిత మాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు బంధు, రైతు రుణ మాఫీ, దాన్యానికి రూ. 500 బోనస్ వంటి అనేక హామీలను నెరవేర్చటంలో విఫలమైందన్నారు. వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు సింగిరెడ్డి నారాయణ రెడ్డి, మాదాపూర్ సింగిల్ విండో చైర్మన్ ఆదిరెడ్డి,బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో సమస్యలు పరిష్కరించుకోవాలి

ఇబ్రహీంపట్నం: ప్రజావాణి కార్యక్రమంలో మండల ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. ప్రజావాణి ప్రతీ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 నిమిషాములకు వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఎమైనా సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

• మన్‌ప్రీతమ్‌కు ఈస్తటిక్స్ సాహితీ అవార్డు

జగిత్యాల: జిల్లాకు చెందిన కేవీ మన్‌ప్రీతమ్‌కు ఈస్తటిక్స్ సాహితీ అవార్డు లభించింది. ఖమ్మం ఈస్తటిక్స్ 2024 సాహితి అవార్డు ఫలితాల్లో మన్‌ప్రీతమ్ రచించిన నూరేళ్ల మోసే తండ్రి కథకు మొదటి బహుమతి లభించింది. ఖమ్మం వారు నిర్వహించిన ఈస్తటిక్స్ సాహితి పోటీలకు 120 కవిత సంపుటిలు రాగా 150 కథలు వచ్చాయని, వాటిలో కవిత సంపుటి విభాగంలో జూకంటి జగన్నాథంకు, కవిత విభాగంలో మన్‌ప్రీతమ్‌కు మొదటి బహుమతి లభించాయి. డిసెంబర్‌లో ఖమ్మంలో జరిగే అవార్డుల ప్రదాన కార్యక్రమంలో రూ.25 వేల నగదుతో పాటు, షీల్డ్ అందుకోనున్నట్లు ఈస్తటిక్స్ రవిమారత్ తెలిపారు.

• ఆర్టిస్ట్ అశోక్‌కు స్పెషల్ ప్రైజ్

జగిత్యాలటౌన్: సృష్టి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఒంగోలు అంబేద్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఒంగోలు ఆర్ట్‌ఫెస్ట్–2024లో భాగంగా జగిత్యాలకు చెందిన ఉపాధ్యాయుడు, ప్రముఖ ఆర్టిస్ట్ భోగ అశోక్ వేసిన అక్రైలిక్ పెయింటింగ్ స్పెషల్ ప్రైజ్‌కు ఎంపికైంది. రియలిస్టిక్ ఆర్టిస్టులు అబ్దుల్ రాయబోసు, పతంగి శ్రీనివాస్ రచయిత సబ్బు ఆర్వీ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. వివిధ విభాగాల్లో 120 మంది చిత్రకారుల చిత్రాలను బహుమతికి ఎంపిక చేశారు. తెలంగాణ నుంచి అక్రైలిక్ పెయింటింగులో అశోక్‌కు ప్రత్యేక బహుమతి లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

• పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

కథలాపూర్: పేదల సంక్షేమం కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోసానిపేటలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. పేదల కోసం ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. బీజేపీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు బత్తుల రవి, ఆంజనేయులు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

• విద్యార్థుల అల్పాహారానికి విరాళం

సారంగాపూర్: మండలంలోని రంగపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవి విరమణ పొందిన ఉపాధ్యాయుడు కైలాసం పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం కోసం సోమవారం రూ. 5 వేలు పాఠశాలకు పంపించారు.పదో తరగతి విద్యార్థులకు అదనపు క్లాసులు నిర్వహిస్తుండడంతో హెచ్‌ఎం టి.సత్యనారయణమూర్తికి డబ్బులు పంపించారు. ఈ సందర్భంగా కైలాసంను పలువురు అభినందించారు.

• మత్స్యశాఖ సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్: మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య ద్వారా అందిస్తున్న సబ్సిడీ పథకాలను గంగపుత్రులు సద్వినియోగం చేసుకోవాలని మత్స్యశాఖ అధికారులు గంగాధర్, గణేశ్, రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం గంగపుత్రులకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో గంగపుత్ర సంఘం జిల్లా నాయకులు తోపారపు రజనీకాంత్, కల్లెడ సత్యనారాయణ, న్యావనంది నడ్పినర్సయ్య, మత్స్యకారులు పాల్గొన్నారు.

• పాఠశాలకు స్మార్ట్ టీవీ వితరణ

ధర్మపురి: మండలంలోని రాజారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అదే పాఠశాలలో 2001–2002 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ.30 వేల విలువగల స్మార్ట్ టీవీని వితరణ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాధు శ్రీనివాస్ ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లక్ష్మి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

• మెస్, కాస్మోటిక్స్ చార్జీల పెంపుపై హర్షం

పెగడపల్లి:వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెస్, కాస్మోటిక్స్ చార్జీల పెంపుపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని కస్తూర్బావిద్యాలయంలో సోమవారం కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో సీఎం రేవంతర్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలోఎస్‌వో మీనాక్షి, కాంగ్రెస్ శ్రేణులు రాములుగౌడ్, శ్రీనివాస్, తిరుపతి, కిషన్, అంజయ్య, రవినాయక్, కస్తూర్బా సిబ్బంది పాల్గొన్నారు.

• మత్స్యకారులకు చేప పిల్లలు పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని మత్స్య కార్మికులకు సోమవారం జిల్లా మత్స్య శాఖ అధ్వర్యంలో చేపపిల్లలను మండల పరిషత్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో చంద్రశేఖర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మత్స్య శాఖ ఫీల్డ్ మెన్ గంగాధర్, సిబ్బంది గణేశ్, రాజేందర్, మత్స్య కార్మికులు పాల్గొన్నారు.

• దరఖాస్తుల గడువు పొడిగింపు

జగిత్యాల: సమగ్ర శిక్ష జగిత్యాల ఆధ్వర్యంలో బాలికల స్వీయ రక్షణ కోసం 2024 కింద ఉచిత శిక్షణ శిబిరాల నిర్వహణ కోసం జిల్లాలోని అర్హులైన కోచ్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యువజన క్రీడా జిల్లా అధికారి రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తుల స్వీకరణకు గడువును నవంబర్ 11 వరకు పొడగించారని, దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

• ఆలయ నిర్మాణానికి విరాళం

మల్యాల: కొడిమ్యాల మండల కేంద్రంలో నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన దంపతులు అంకం ప్రవీణ్–ప్రియాంక తమ వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని రూ.50,116/- విరాళంగా అందజేశారు. ఈ మేరకు సోమవారం ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు అభినందించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

• విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేట, రాఘవపేట సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వినీత్‌రెడ్డి తెలిపారు.

పెద్దాపూర్‌లో వైద్యశిబిరం

మెట్‌పల్లిరూరల్: మండలంలోని పెద్దాపూర్‌లో పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన జాతీయ సేవా పథక ప్రత్యేక శిబిరంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్సీ పరామర్శ

రాయికల్: పట్టణానికి చెందిన చింతకుంట సాయి కుమార్ తండ్రి గంగారాం, మైనార్టీ నాయకులు రవూఫ్ భార్య ఫర్హీనాబేగం, ఇటిక్యాలలో బోడుగం జితేందర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వారిని పరామర్శించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, నాయకులు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపల్లి గంగారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

అడిషనల్ కలెక్టర్‌కు అభినందనలు

జగిత్యాల: జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బీఎస్.లతను పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు బోయినపల్లి ఆనందరావు, యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి కలిసి అభినందనలు తెలిపారు. అలాగే సీనియర్ సిటిజన్స్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై కేసు

కథలాపూర్: మండలం దుంపేట గ్రామానికి చెందిన అరిగెల సరితను అదనంగా వరకట్నం తేవాలని వేధిస్తున్న గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన ఆమె భర్త అరిగెల గంగాధర్‌తోపాటు ఆమె అత్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ సోమవారం తెలిపారు. సరితకు వివాహం సమయంలో రూ. లక్ష, 2 తులాల బంగారు ఆభరణాలు వరకట్నం కింద ఇచ్చారు. ఇటీవలే అదనంగా రూ.లక్ష వరకట్నం కావాలని ఆమె భర్త గంగాధర్, అత్త వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలు సరిత ఫిర్యాదు మేరకు భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అగ్నిప్రమాదంలో గుడిసె దగ్ధం

కథలాపూర్:మండలంలోని సిరికొండలో జుంబర్తి గంగారం గుడిసె అగ్నిప్రమాదంలో దగ్ధమైనట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. గంగారాం ఒంటరిగా గుడిసెలో నివసిస్తున్నాడు. రోజుమాదిరిగానే గ్యాస్ సిలిండర్‌పై వంట చేసుకుని బయటకు వెళ్లాడు. వంటగ్యాస్ మంటలు గుడిసెకు అంటుకోవడంతో కాలిపోయినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. గుడిసె పూర్తిగా కాలిపోవడంతో గంగారాం నివసించడానికి నీడ కరువైందని, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

స్కాలర్‌షిప్‌ల దరఖాస్తుకు కొత్త గైడ్‌లైన్స్

జగిత్యాల: ఎస్సీ విద్యార్థుల పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతన మంజూరు విషయంలో నూతన గైడ్‌లైన్స్ పొందుపర్చిందని, ఈ విద్యా సంవత్సరం మూడు దశల్లో ప్రక్రియ ఉంటుందని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెమో అథంటికేషన్, బయోమెట్రిక్ అథంటికేషన్, రిజిస్ట్రేషన్ మూడు దశల్లో ఉంటుందని, మొదటి దశలో ఈపాస్ వెబ్‌సైట్‌లో ఫ్రెష్ రెన్యువల్ రిజిస్ట్రేషన్‌లో భాగంగా తన ఆధార్ నంబరును సమర్పించి పదోతరగతి డిటేయిల్స్ మ్యాచ్ చేసుకోవాలని, అనంతరం మెసేజ్ వస్తుందన్నారు. రెండో దశలో మీసేవ కేంద్రంలో బయోమెట్రిక్ అథంటికేషన్ చేయాల్సి ఉంటుందని, దాని తర్వాత మూడో దశ ఉంటుందని తెలిపారు. మూడు దశల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన అనంతరం దరఖాస్తులను కళాశాల ప్రిన్సిపల్స్‌కు అందజేయాలని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ అంతా ఈ పాస్ వెబ్‌సైట్‌లో ఉంటుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సారంగాపూర్: జగిత్యాల నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ మీదుగా మంచిర్యాల వెళ్లేందుకు ఈ రహదారి ప్రధానం. ఆర్అండ్‌బీ శాఖ పరిధిలోకి వచ్చే ఈ రహదారిపై మండలంలోని కోనాపూర్ వాగుపై రూ. 5.45 కోట్లతో హైలెవల్ వంతెన నిర్మాణం పూర్తి చేశారు. వంతెనకు ఇరువైపుల అప్రోచ్ రహదారిని మట్టితో నిర్మించారు. దీనిపై తారురోడ్డు వేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మట్టిపై కంకర వేసి, తారు నిర్మాణం చేయాల్సి ఉంది. అధికారులు స్పందించి వంతెనకు ఇరువైపులా పూర్తిస్థాయి తారు రోడ్డు నిర్మిస్తే వాహనదారులకు ఇబ్బందులు తప్పుతాయి.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఆదిత్య, ఏఈ, ఆర్అండ్‌బీ శాఖ, సెల్ నంబర్: 9440818883

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

సమగ్ర సర్వేలో తప్పులు లేకుండా చూడాలి



ధర్మపురిలో కుటుంబ సర్వేపై సమావేశం

జగిత్యాలరూరల్: సమగ్ర సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి బోనగిరి నరేశ్ అన్నారు. సోమవారం ఎస్వీఎల్ఆర్ గార్డెన్స్‌లో జగిత్యాలరూరల్, అర్బన్ ఎన్యుమరేటర్ల సమగ్ర ఇంటింటి సర్వే శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో అన్ని అంశాలను పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రవిబాబు, వాసవి తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: కొడిమ్యాల మండల కేంద్రంలోని రైతు వేదికలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ఎంపీడీవో స్వరూప పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఎన్యూమరేటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రతేక్యాధికారి, వివిధ గ్రామాల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో ఎన్యూమురేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందిగా చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్యూమరేటర్లకు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంఈవో మధు, ఏపీఎం శంకర్, ఎమ్యూనురేటర్లు పాల్గొన్నారు.

ధర్మపురి: కుటుంబ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి రాంచందర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమగ్ర కుటుంబ సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే) పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఎంపీవో నరేష్‌కుమార్, ఏపీవో సృజన్,పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పెగడపల్లి: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి మనోహర్ ఎన్యుమరేటర్లకు సూచించారు. పెగడపల్లి రైతువేదికలో సోమవారం ఇంటింటి కుటుంబ సర్వేపై ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్, పాల్గొన్నారు.

సారంగాపూర్: సమగ్ర కుటుంబ సర్వేపై మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బి. సుజాత, తహసీల్దార్ మహ్మద్ జమీర్, ఎంపీడీవో చౌడారపు గంగాధర్, ఎంపీవో శశికుమార్‌రెడ్డి ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



ఎంపికైన విద్యార్థునులతో ఉపాధ్యాయులు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్‌లోని మౌంట్ కార్మెల్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు జాహ్నవి, శివాని ఈనెల 8న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీలు మంగ, పులి విజ్ఞన్, సమంత్, హరీశ్ తెలిపారు.

కోరుట్ల రూరల్: మండలంలోని మాదాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన 10 వ తరగతి విద్యార్థిని బత్తిని రసజ్ఞ రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైంది. ఈ సందర్భంగా హెచ్‌ఎం నవీన్, పీఈటీల శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

కథలాపూర్: మండలకేంద్రంలోని మాస్ట్రో హైస్కూల్‌లో పదోతరగతి చదువుతున్న చెదలు వరుణ్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి షార్ట్‌పుట్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఆకుల రంజిత్ సోమవారం తెలిపారు. వరుణ్‌ను అభినందించారు.

మేడిపల్లి: భీమారం హైస్కూల్ పాఠశాల విద్యార్థినిలు తాల్క దీపిక, ఉదిగిరి అనూహ్య, జవ్వాజి హరిక, భైరా మధుప్రియలు జగిత్యాల జిల్లా స్థాయిలో అండర్ –14 హ్యాండ్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు హెచ్‌ఎం అశోక్, పీఈటీ పెసరి తిరుమలేశ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థినులు నవంబర్ 5న కరీంనగర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రాయికల్: పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలకు చెందిన దానవేని రిశ్వాంత్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మహేశ్ సోమవారం తెలిపారు.

విద్యార్థికి అభినందన

మల్యాల: కొడిమ్యాల మండలం తిర్మలాపూర్ జెడ్పీహెచ్‌కు చెందిన విద్యారి బోయిని శివమణి నవంబర్ 8 నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికకాగా, హెచ్‌ఎం బి.జ్యోత్స్నదేవి అభినందించారు.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి



పొలంబాటలో పాల్గొన్న అధికారులు, రైతులు

జగిత్యాలరూరల్: రైతులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ట్రాన్స్‌కో డీఈ రాజిరెడ్డి అన్నారు. సోమవారం విద్యుత్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో మండలంలోని పొలాసలో చేపట్టిన పొలం బాట కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్‌లు చెడిపోతే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. ఎలాంటి విద్యుత్ సమస్యలు వచ్చినా విద్యుత్ శాఖ సిబ్బందికే సమాచారం అందించాలన్నారు. రైతులు కెపాసిటర్లు బిగించుకోవాలని, దీంతో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఏడీఈ జవహర్‌లాల్‌నాయక్, ఏఏఈ సుందర్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.